# అంచనాలు

-ఆకెళ్ల శ్రీరామకృష్ణ

పవిత్ర గోదావరి నదీజలాల ప్రవాహ వీచికలతో ప్రశాంతంగా, పచ్చని పైరులతో కళకళలాడే రామచంద్రాపురంలో ఎదురెదురు ఇళ్ళల్లో ఉండేవారు రామారావు, సుబ్బారావులు. వాళ్ళు స్నేహానికి మారుపేరని ఆ ఊళ్లో ఎవరిని అడిగినా చెబుతారు. స్కూలు చదువు నుంచి కాలేజీ వరకు ఇద్దరూ కలిసే చదువుకున్నారు. వారి అభిప్రాయాలు, ఆదర్శాలు వేరైనప్పటికీ, మనస్సులు మంచివి కావడంతో వారిమధ్య ఎప్పుడూ పొరపొచ్చాలు చోటుచేసుకోలేదు.

ఉద్యోగాలు వారిని వేరుచేసినప్పటికీ, ట్రాన్స్‌ఫర్ల పుణ్యమాని మళ్లీ ఇద్దరూ హైదరాబాదు చేరారు. వాళ్ల ఆనందానికి అవధుల్లేవు. సాయంత్రం ఆరుగంటలకల్లా ఏదో ఒక ప్రశాంత ప్రదేశం చేరుకుని కబుర్లు చెప్పుకుంటూ సరదాగా రాత్రి ఎనిమిదింటిదాకా కాలక్షేపం చేసేవారు.

''ఈ ఆచారాలైనా, సాంప్రదాయాలైనా తోటి మనిషి నుంచి డబ్బు దోచుకోవడానికేరా!'' అన్నాడు సుబ్బారావు.

''సాంప్రదాయాలనేవి తప్పుకాదు! వాటి ఆచరణలోనే దోషముంటోంది''

''అంటే కట్నకానుకలని, లాంఛనాలని ఆడతరుపు వారి ముక్కుపిండి వసూలు చేయడం మంచిదేనంటావా?''

''మంచిదని నేననను. కానీ ఇవ్వడం పుచ్చుకోవడం అనేది రెండువైపులా వుండేది. మగ పెళ్లివారు పుచ్చుకున్న కట్నానికి తగ్గట్టుగా పెళ్ళికూతురుకు తగిన బంగారం పెట్టే సాంప్రదాయం వుంది. అయితే కాలక్రమేణా మగపెళ్లివారి ఖర్చు తగ్గిపోయి, ఖర్చు ఆడపెళ్లి వారివైపు ఎక్కువ మొగ్గుచూపుతోంది. అది ఇస్తున్నవాళ్ళ తప్పుకాని, అడిగే వారిదికాదు. డబ్బుతోనే తమ కూతురు సుఖపడగలదనుకునే ఆడపిల్ల తండ్రి ఆశను వాళ్ళు సొమ్ము చేసుకుంటున్నారు'' అన్నాడు రామారావు తన ధోరణిలో.

''ఏ తండ్రైనా తన కూతురును తన స్థాయికన్నా పైన వున్నవాడికే ఇచ్చి చేయాలనుకుంటాడు. అందులో తప్పేముంది? ఉదాహరణకు ఒక కూలీ, తన కూతురును ఏ మేస్త్రీకో ఇవ్వాలనుకుంటాడు గాని అంతకన్నా తక్కువవాడికి చూస్తూ చూస్తూ ఇవ్వడు కదా! ఏ మనిషికైనా సుఖం అనేది డబ్బులోనే వుందిరా? బుద్ధిమంతుడని, మంచివాడని పూటకు గతిలేనివాడికి నీ కూతుర్నిచ్చి చేసావు. ఏం సుఖపడుతోందో చెప్పు'' అన్నాడు సుబ్బారావు.

ఆ మాటలకు రామారావు బాధపడ్డాడు. కానీ స్నేహితుడి తత్త్వం తెలిసినవాడు కావడంతో కోపం తెచ్చుకోకుండా అతనికి ఇప్పుడేం చెప్పినా అర్థంకాదు, సమయం వచ్చినప్పుడే చెప్పాలనుకొని, తన భావాన్ని పైకి కన్పడనీకుండా ''నీ అభిప్రాయం తప్పు. డబ్బు అనేది మనిషికి అవసరమే? కానీ డబ్బుకోసమే బ్రతక్కూడదు'' వాదించాడు.

వాళ్ళవాదన ఓ కొలిక్కిరాలేదు. కానీ అప్పటికే చాలా చీకటి పడిపోవడంతో వాళ్ళ వాదనను వాయిదా వేస్తున్నట్టుగా సుబ్బారావు '' అన్నట్టు చెప్పడం మర్చిపోయాను, రేపు మా అమ్మాయికి పెళ్లిచూపులు ఏర్పాటుచేశాం. వీలుంటే సాయంత్రం అలా మా ఇంటికి రాకూడదూ'' అన్నాడు.

''దానికేం భాగ్యం! ఇంతకూ అబ్బాయి ఏం చేస్తున్నాడు? కట్నం ఎంతిస్తున్నావు? ఏమిటి?'' అడిగాడు రామారావు.

''అబ్బాయి స్టేట్‌బ్యాంక్‌లో మేనేజర్‌గా చేస్తున్నాడు. అబ్బాయి తల్లిదండ్రులు స్వతహాగా బాగా వున్నవాళ్ళు. అబ్బాయికి ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం అంతగా లేదనుకో. కానీ ఏదో కాలక్షేపం కోసం చేస్తున్నాడు. మా అమ్మాయి ఆ ఇంటి కోడలు అయితే కాలు కింద పెట్టక్కర్లేదనుకో''

తన భావాన్ని పైకి కన్పడనీకుండా ''నీ అభిప్రాయం తప్పు. డబ్బు అనేది మనిషికి అవసరమే? కానీ డబ్బుకోసమే బ్రతకూ్కడదు'' వాదించాడు.

''అవన్నీ సరేరా మీ అమ్మాయి సరిత బాగా చదువుకుంటోంది. పైగా పెద్ద సంబంధం అంటున్నావు. అంత ఎత్తుకు నువ్వు తూగగలవో లేవో ఆలోచించావా?''

''చదువుదేముందిరా! తర్వాతైనా చదువుకోవచ్చు. ఇక తాహతు అంటావా? నాకా ఒక్కర్తే కూతురు. ఉన్నదంతా దానికే గదా!'' అన్నాడు దృఢమైన నిర్ణయంతో.

రామారావు మాట్లాడానికేమీ మిగల్లేదు. నిర్ణయం తీసుకోవడం అయిపోయిది. ఇప్పుడు ఇక తను ఏం చెప్పినా ఆలోచించే స్థితిలో లేడనుకుని ''కంగ్రాచ్యులేషన్స్!'' అంటూ బయలుదేరాడు.

★★★

రోజులు గడిచి సంవత్సరంగా రూపుదిద్దుకొనేలోపు సుబ్బారావు తన కూతురు వివాహం రంగరంగ వైభవంగా చేసాడు. వీడియోల లైటింగ్‌లో, వినూత్నంగా అమర్చిన విద్యుద్దీపాల వెలుగులో తన కూతురును, అల్లుడిని చూసుకుని పరమానంద భరితుడయ్యాడు.

ఆ ఆనందం కోసం తన శక్తికిమించి దొరికిన ప్రతీ చోటా అప్పుచేశాడు. తన అల్లుడు బ్యాంక్‌లో ఆఫీసర్ అని చెప్పుకుని పొంగిపోతున్నాడు. పెళ్లికి వచ్చినవారంతా 'వధూవరులిద్దరూ మేడ్‌ఫర్ ఈచ్ అదర్'గా వున్నారంటూ సుబ్బారావు సెలక్షన్‌ను అభినందిస్తుంటే ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ఆనందభాష్పాలతో కూతుర్ని అత్తవారింటికి సాగనంపాడు.

★★★

ఆ రోజు సుబ్బారావు ఆఫీసుకు బయల్దేరబోతున్నాడు.

సరిత ఒక్కత్తే ఇంటిముందు ఆటోలో దిగింది.

భార్యాభర్తలిద్దరూ గతుక్కుమన్నారు.

''ఏంటమ్మా! ఒక్కదానివే వచ్చావు. అల్లుడుగారేరి? అలా చిక్కిపోయావేంటమ్మా?''

''బాగానే వున్నానమ్మా. బాగానే చూసుకుంటున్నారు. వెళ్లి మూణ్ణెల్లు అయింది కదా! ఒక్కసారి చూసిపోదామని వచ్చాను'' అంది ముభావంగా సరిత.

అదేమిటీ! తాము అంతలా అడిగితే ముక్తసరిగా జవాబు చెపుతోంది, ప్రయాణం చేసి వచ్చింది కదా అలిసిపోయి వుంటుంది అనుకున్నారు.

భోజనాల దగ్గర అసలు విషయం బయటపెట్టింది కూతురు.

''నాన్నా! మీరు ఆయనకు అలకపాన్పు మీద హీరో హోండా కొనిస్తానన్నారుట. ఆయనకు బ్యాంక్‌కు వెళ్ళడం ఇబ్బందవుతోందిట. దాని విషయం కనుక్కురమ్మని పంపించారు'' అంది నసుగుతున్నట్టుగా.

ఒక్కసారిగా కూరలోని కారం ఎక్కువైనట్టయి పొలమారింది సుబ్బారావుకు. భార్య మంచినీళ్ళందించింది. అప్పుడేదో అదేదో ఊరికే అదో లాంఛనంగా, సరదాగా బంధువులందరూ ఏదో ఒకటి ఇస్తామని చెప్పమంటే గొప్పగా చెప్పాడు. ఇప్పుడది పీకకు చుట్టుకుంది.

కూతురు దగ్గర ఏమైనా అంటే చిన్నబుచ్చుకుంటుందేమోనని, ''అలాగేనమ్మా నేను రేపట్నుంచి ఆ ప్రయత్నంలోనే వుంటాను'' అన్నాడు.

మరుసటిరోజు అన్నట్టుగానే డి.డి తీసి ఇచ్చి పంపించాడు. ఒకపక్క పెళ్ళికి చేసిన అప్పులు ఇంకా తీరకముందే అప్పుడే అదనపు ఖర్చు. అయినా ఎవరికిచ్చాడు? తన కూతురు, అల్లుడికే కదా! అని సర్దుకున్నాడు.

సరిత వెళ్లిన నెలరోజుల తర్వాత మరో ఉత్తరంలో తెలిసింది తాను తాత కాబోతున్నాడని. వాళ్ల ఆనందానికి హద్దు లేకపోయింది. వెంటనే సుబ్బారావు, పూర్ణ ఇద్దరు బయల్దేరి కూతురింటికెళ్ళారు.

ఆరోజు రాత్రి పదింటిదాకా అల్లుడు వస్తాడేమో, కలిసి భోజనం చెయ్యొచ్చని ఎదురుచూసాడు. ఆశ నిరాశే అయ్యింది. ఎంతసేపటికీ రాకపోయేసరికి కూతురు బలవంతం మీద భోజనం అయిందనిపించి లేచాడు.

మరోగంట ఎదురుచూసి నిద్రకుపక్రమించబోతుండగా కాలింగ్‌బెల్ మ్రోగింది. వెళ్ళి అల్లుణ్ణి పలకరిద్దామనుకునేలోగా భార్య పూర్ణ ''ఇప్పుడేగా వచ్చాడు. పొద్దున్నే మాట్లాడుదురుగాని లెండి'' అని వారించింది.

బయట నుంచి మాటలు వినిపించసాగాయి.

''ఏంటి? ఎంతసేపుకాలింగ్‌బెల్ నొక్కినా తలుపు తియ్యవేం? తిండి ఎక్కువై మెలకువ రావడం లేదా?'' అల్లుడి గొంతుని పోల్చుకోగలిగాడు సుబ్బారావు.

''ఉష్..గట్టిగా మాట్లాడకండి. మా అమ్మా నాన్నా వచ్చారు'' అంది సరిత.

''అయితే నేను నోరు మూసుకోవాలా? పార్టీకెళ్లాను.. అంతే..'' అంటూ గట్టిగా అరుస్తూ, తూలుతూ తప్పటగులు వేస్తున్న భర్తను సైగలతో సముదాయించి లోపలకు తీసుకెళ్ళింది. అల్లుడి ధోరణి చూసి సుబ్బారావు గతుక్కుమన్నాడు. తన అల్లుడు తాగుతాడా? ఉదయాన్నే అడుగుదాంలెమ్మని మనస్సును సమాధాన పర్చుకున్నాడు. నిద్రపట్టలేదు.

అల్లుడు బాంక్ ఆఫీసరు కదా! ఎవరో బలవంతపెట్టి వుంటారు. అయినా ఆఫీసర్లకు ఇటువంటి మొహమాటాలు తప్పవు అనుకుని మనస్సును సమాధాన పర్చుకుని నిద్రకుపక్రమించాడు.

ఎవరిదో సన్నగా ఏడుపు, చిన్నగా మాటలు వినబడుతుంటే ఉలిక్కిపడి లేచాడు. పక్కనవున్న భార్యవైపు చూసాడు. ఆమె పక్కన లేదు. ఎక్కడికెళ్ళుంటుందబ్బా! అనుకొని లేచికూర్చుని గది నాలుగుదిక్కులు పరికించేసరికి తలుపు అవతలి వైపునుంచి వినవస్తున్నాయా మాటలు.

''ఊరుకో అమ్మా! నీకెంతకష్టం వచ్చిందే తల్లీ. మంచి ఉద్యోగస్థుడని, కలిగిన వారింట్లో నిన్ను ఇచ్చిచేస్తే సుఖపడతావనుకుని మాకున్నదంతా ధారపోసి, చివరకు నిన్నీ నరకంలోకి నెట్టామా తల్లీ'' అంటోంది తల్లి.

''కొత్తలో ఒకనెలరోజులు బాగానే వున్నారు. ఆ తరువాతనుంచీ ప్రతిదానికీ పెడర్థాలు తీయడం, చిన్నవిషయాన్ని భూతద్దంలో చూసి మరీ గొడవ పెట్టుకుంటారు. రెండుమూడుసార్లు చెయ్యికూడా చేసుకున్నారు''


అవాక్కయింది పూర్ణ.

''జీతమైనా ఇంటికి తెస్తాడా?'' అడిగింది.

''జీతంలో సగం పైగా ఆయన విలాసాలకే సరిపోతోంది. ఆయన ఏం చేసినా అడక్కూడదు. నేనూ ఒట్టిమనిషిని కానుగదా! డాక్టర్ దగ్గరకు వెళ్దాం రండీ అంటే కోప్పడుతున్నారు. నా గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. నేనేం చేయాలో తోచడం లేదమ్మా. ఒక్కోదశలో ఆయన్ను చూస్తే భయం వేస్తోంది''. అంటూ బావురుమంది సరిత.

''తప్పమ్మా! అలా అనకూడదు. నేనూ, నాన్నగారూ కలిసి అతనికి నచ్చచెపుతాం కదా! కష్టాలొచ్చినప్పుడే ఓర్చుకోవాలమ్మా! ఊరికే అలా ఏడవకూడదు. నాన్నగారు వింటారు ఊరుకోమ్మా'' అంది పూర్ణ.

సుబ్బారావు గుండె పగిలిపోయింది. మెదడులోని నరాల్ని మెలివేసినట్లుగా వుంది. భాపకందని బాధనుభవించాడు. తను విన్నదంతా నిజమా?! తన ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న తన కూతురు ఇంత బాధనుభవిస్తోందా? బాధపడతానని తనతో చిన్నమాటైనా చెప్పకుండా ఎంత మనోవేదననుభవిస్తోంది?



తానే కావాలని ఆమె ప్రేమించిన వ్యక్తికి ఆస్తిలేదని, డబ్బుంటే చాలు సుఖపడుతుందనీ భావించి, ఏరికోరి బలవంతంగా ఈ పెళ్లి చేశాడు. అయినప్పటికీ తనమీద గౌరవంతో గుట్టుగా ఎంత క్షోభ అనుభవిస్తోంది? తను ఇప్పుడేం చేయాలి? అతనితో తెగతెంపులు చేసుకుని తన కూతుర్ని తీసుకుపోవాలా? లేదమ్మా అలాగే బాధలు భరిస్తూ వుండమ్మా అని వదిలేసి పోవాలా? ఇంత మానవత్వంలేని మనిషిని ఏం చేస్తే మారతాడు? ఏం చెబితే వింటాడు?

మర్నాడు ఈ బాధావేశంతో తనేం చేస్తాడో తనకే తెలీని పరిస్థితిలో అక్కడ క్షణం వుండలేక భార్యను తీసుకుని, కూతురుతో అర్జంటు పనివుందని చెప్పి వెంటనే ఇంటికి వచ్చేశాడు సుబ్బారావు.

జీవితంలో డబ్బే ప్రధానం అనుకుని వెనుకాముందూ చూడకుండా కూతురు నూరేళ్ళ జీవితాన్ని నరకప్రాయం చేశాడు. డబ్బుకన్నా గుణం ప్రధానం. ఆ గుణం తన అల్లుడిలో లోపించింది. దానివల్ల తన కూతురు కష్టాలు అనుభవిస్తోంది.

ఆ సాయంత్రం రామారావును కలిసాడు. తన బాధంతా వివరించేసరికి అతనూ నొచ్చుకున్నాడు.

''తొందరపాటుతో తీసుకునే నిర్ణయాలు ఇలాంటి ఫలితాన్నే ఇస్తాయిరా. మన కోరికల్ని పిల్లల జీవితాలకి ముడిపెడితే ఫలితం ఈరకంగానే వుంటుంది. నేను కూడా నీలానే ఆలోచించి చేసుంటే ఈనాడు నాకూతురు, అల్లుడు ఇంత సుఖంగా వుండేవారా? నా అల్లుడు ఆస్తిలేనివాడే కావచ్చు, కానీ కట్టుకున్న భార్యను సుఖపెట్టగలిగే మనసున్న మనిషి'' అంటున్న రామారావు వీధివైపు చూసి ఇంట్లోకి వస్తున్న దంపతుల్ని చూపించి ''అతనే మా అల్లుడు భాస్కర్'' అంటూ తన అల్లుడ్ని పరిచయం చేసాడు కించిత్ గర్వంతో.

అతన్ని చూసిన సుబ్బారావు క్షణంసేపు దిగ్భ్రాంతికి లోనయ్యాడు. సుబ్బారావును చూసిన భాస్కర్ కూడా అదిరిపడ్డాడు. వాళ్ళిద్దరూ ఇంతకుముందే పరిచయం వున్న వ్యక్తుల్లా ఒకరినొకరు చూసుకోవడం చూసిన రామారావుకి వాళ్లకి పూర్వపరిచయం వుందని అర్థమైంది.

కానీ సుబ్బారావుకు మాత్రమే తెలుసు, తన కూతురు మనసిచ్చినవాడు, మంచి మనసున్నవాడు అతడేనని.

★